# పూలు

టి. విమల

★ అందాన్ని రెట్టింపుచేసేవీ, ఆనందానికి ఆలంబనగా ఉండేవీ, చూడగానే ఆకర్షించేవీ పూలు. అయితే ఆ పూల వెనక హృదయం కదిలేే కధలూ ఉండొచ్చు. ఆ కథ తెలిసిననాడు.... ★

"సుజీ! ఏవిటి చూస్తున్నావ్?"

బాల్కనీలో కూర్చొని, వీధివైపు పరీక్షగాచూస్తోన్న శ్రీమతికి ఎదురుగ్గా కుర్చీ లాక్కొని, కూర్చుంటూ అడిగాను.

"రంగడు వొస్తాడేమోనని" సమాధానం చెప్పింది సుజాత.

సుజాతకు తెలియకపోవచ్చు. కాని, నాకు తెల్సు—ఇక రంగడు రాడని.

"వాడు చాలా రోజుల నుంచీ రావడం లేదండీ. వొంట్లో సుస్తీ చేసిందో ఏమో! పాపం దిక్కులేనోడు" సుజాతే మళ్ళీ దిగులుగా అంది.

అవును మరి! వాడికీ సుజాతకూ మధ్యవున్న అనుబంధం అటువంటిది.

నాకెందుకో నిజం చెప్పేయాలనిపించింది. కాని చెప్పలేకపోయాను.

సుజాత ఇంకా వీధివైపు చూస్తూనే వుంది.

నా ఆలోచనలు మాత్రం రంగడి చుట్టూ తిరుగుతూనే వున్నాయి.

రంగడు ఇసుకలో బ్రిడ్జీలు కట్టలేదు. చీకటి వ్యాపారం చెయ్యలేదు. దొంగతనాలూ, దోపిడీలూ చెయ్యలేదు.

అధికారాన్ని అరచేతిలో వుంచుకొని, అందినంతవరకు జేబులు నింపుకొని ఆస్తిపాస్తులు సంపాదించుకోలేదు. కామాంధకారంతో కన్నెపిల్లల శీలాన్ని దోచుకోలేదు.

పదవి చేజిక్కించుకోగానే, వేదికమీద ఉపన్యాసాలూ, ఎన్నికల వాగ్దానాలూ, ఓట్లుకోసం వొంగి వొంగి చేసిన దొంగ నమస్కారాలూ, ఓటువేసిన ప్రజల కష్టసుఖాలూ మరచిపోయి, ఎయిర్ కండిషన్డు గదుల్లో, నియోన్ లైట్ కాంతుల్లో, పట్టుపరుపుల మీద పవళించి, దేశాన్ని ఏ విధంగా కొల్లగొట్టాలో అని ఆలోచించే వినా(శ)యకుడు అంతకంటే కాదు.

ఈ దేశంలో—ఈ పవిత్ర భారత దేశంలో-

'అన్నమో రామచంద్రా'—అని ఎంతమంది అభాగ్యులో ఆర్తనాదాలు చేస్తున్నప్పటికీ అన్నపూర్ణగా వాసికెక్కిన ఈ దేశంలో—

'కోటి విద్యలూ కూటికొరకే' అని భావించి ఎంతమందో పొట్టపోసుకుంటున్న ఈ దేశంలో-

జానెడు పొట్టకోసం కోటి విద్యల్లో ఓ విద్యని తాత్కాలికంగా జీవనాధారం చేసుకొని బ్రతికే ఒక దిక్కులేనివాడు—రంగడు.

వాడు ఒక పూలవాడు.

పూలమ్ముకొని బ్రతికే ఒక నిర్భాగ్యుడు.

కాని—ఆఖరిసారిగా వాడ్ని నేను చూచినప్పుడు వాడిమీద చెప్పలేనంత అసహ్యం కలిగింది. ఏహ్యభావం జనించింది. నిజంగా నా చూపులకి ఎదుటివ్యక్తి మాడి మసి అయ్యే శక్తిగానీ, మహిమగానీ వున్నట్లయితే రంగడు మాడి మసయ్యేవాడే! అలా వున్నాయి అప్పుడు నా చూపులు.

కాని—ఇప్పుడు వాడిమీద జాలి, సానుభూతీ మినహాయించి మరే భావమూ లేదు. అందుకే అప్పుడప్పుడూ రంగడ్ని గురించి బాధపడుతూ వుంటాను.

అసలు రంగడితో నాకు ఎలా పరిచయ

మయ్యింది?

*   *   *

ఆ రోజు—

ఆ రోజూ ఇలాగే సాయంత్రం నీరెండలో, కుర్చీలు వేసుకొని బాల్కనీలో కూర్చొని, సిగరెట్టు పొగలతో మేఘాలు సృష్టిస్తూ, పడమటి కొండల్లో అంతిమ శ్వాస వొదులుతూన్న సూర్యుడ్ని చూస్తున్న తరుణంలో, వీదిలో అరుపులు వినిపించాయి.

నా దృష్టి పడమర కొండలమీది నుండి తృటికాలంలో వీధిలో అరుస్తూన్న ఆ మనిషి మీదికి మళ్ళింది.

అలా అరుస్తున్నవాడు—సుమారు ఏడెనిమిది సంవత్సరాల పసివాడు.

మాసిన చొక్కా—మాసిన నిక్కరూ—తైల సంస్కారంలేని జుట్టూ—జుట్టుమీద మేదర బుట్టా—బుట్టలో రకరకాల పూలూ—ఇదీ నాకు కనిపించిన ఆ పిల్లవాడి వాలకం.

పూలూ పూలోయమ్మ పూలూ
ఘుమ ఘుమ గుబాళించే గుండుమల్లెలూ
తాజా పువ్వులూ. రోజా పువ్వులూ
సంపెంగలూ సన్న జాజులూ
బొండు మల్లెలూ చామంతులూ

—అరుస్తున్నాడు పూలవాడు. కాదు కాదు.. రిథమిక్‌గా పాటలా పాడుతున్నాడు.

నిజానికి వాడి నెత్తిమీద వున్న బుట్టలో అన్ని రకాల పూలు వున్నాయో లేదో నాకు తెలియదుగాని, పాటకోసం అనువుగా అలా పాడుతున్నాడని ఆ క్షణంలో నేను అభిప్రాయపడ్డాను.

అంత చిన్న వయసులో, ఇప్పటినుంచే జీవిత పోరాటానికి సిద్ధమైన ఆ కుర్రాడిమీద నాకెందుకో సానుభూతి ఏర్పడింది.

వాడ్ని చూస్తూ అలాగే వుండిపోయాను, చాలసేపు.

"ఏమండీ! ఆ పూలవాడ్ని పిలవరూ" సుజాత నా వెనగ్గా నిలబడి అడుగుతోంది. అసలు ఆమె అక్కడికి ఎప్పుడు వచ్చిందో కూడా నేను గమనించలేదు.

మరుక్షణంలోనే వాడిని పిలిచాను.

సుజాతకు సన్నజాజులంటే ప్రాణం; అవే తీసుకుంది. డబ్బులిచ్చి పంపించేశాను పూలవాడిని.

వాడు వెళ్ళిపోయిన తర్వాత సుజాత కుర్చీ లాక్కుని నా ఎదురుగ్గా కూర్చుంది.

"పూలు చూడండి—ఎంత బావున్నాయో. మంచులో తడిసిన ముత్యాల్లా వున్నాయికదూ" అంది సుజాత—సన్నజాజుల్ని ముక్కు దగ్గర వుంచుకొని, ఆ పరిమళాన్ని తనివితీరా ఆస్వాదిస్తూ.

"పూలు కొన్నది వాసన చూడ్డానికా? తలలో ముడుచుకోడానికా?" అన్నాను చిలిపిగా, సుజాత కళ్ళల్లోకి చూస్తూ.

"ఊఁహుఁ తలలో రాత్రికి" అంది సుజాత—సిగ్గుతో ముడుచుకుపోతూ—మధుర స్మృతులు మనసుని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే.

నేను కొంచెంసేపు మౌనంగా వుండిపోయాను. తర్వాత మరో సిగరెట్టు వెలిగించి పొగలు వొదులుతూ, ఆలోచిస్తూ వుండిపోయాను.

నిశ్శబ్దంగా నిముషాలు దొర్లిపోతున్నాయి.

"ఏమిటోనండీ! వాడ్ని చూస్తుంటే జాలేస్తుంది నాకు. అందుకే నేనెప్పుడూ వాడిదగ్గరే పూలు కొంటుంటాను"—ఉన్నట్లుండి సుజాత నోటినుండి వెలువడిన మాటలకు, ఆలోచనల నుండి తేరుకొని, క్షణకాలం సుజాత ముఖంలోకి చూశాను ఆశ్చర్యంగా.

"ఏవిటి సుజీ! ఆ పూలవాడు నీకు ఇంతకు ముందే తెలుసేమిటి?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఆహాఁ. రోజూ నేను కురుల్లో తురుముకొనే పూలూ—రోజూ తమరు పడగ్గదిలో నా తల్లోని పూలవాసనల్ని ఆస్వాదిస్తూ సుజీ డియర్! ఈ పూలెంత బావున్నాయ్! ఎంతటి పరిమళాల్ని వెదజల్లుతున్నాయ్! ఆహాఁ . ఓహో అని మీరు మెచ్చుకొనే పూలూ—నాకెక్కడి నుండి వొస్తున్నాయనుకొన్నారు? ఆ కుర్రాడు తెచ్చేవా గదా!" అంది సుజాత కాస్త ఎక్కిరింపుగా, కాస్త డ్రెమెటిక్‌గా.




'ఇంకేం మొగుడికోసం పూలవాడ్ని మంచి చేసుకొస్తావన్నమాట! ఇంతకీ నేను రోజూ పూలు తీసుకురావడం లేదనేగదా ఈ వెక్కిరింపంతా. అదీ కాదోయ్! నీకు తెల్సుగదా నా సంగతి. నీమీద నాకు పూలు తెచ్చేంత ప్రేమ కూడా లేక కాదు. మతిమరుపు అంతే!'' అన్నాను శ్రీమతిని వుడికించాలనే ఉద్దేశంతో.

సుజాత నవ్వి వూరుకుంది.

ఆ తర్వాత సుజాత చెప్పిన కథనాన్నిబట్టి ఆ పూలవాడి పుట్టు పూర్వోత్తరాలు యివి—

వాడి పేరు రంగడు.

వాడికి తల్లెవరో, తండ్రెవరో తెలీదు. అసలు ఎక్కడ పుట్టాడో, ఎప్పుడు పుట్టాడో కూడా తెలీదు. వాడికి ఊహ తెలిసేనాటికి ఈ ఊరి వీధుల్లో తిరుగుతున్నాడు. వాడి చేతుల్లో చిల్లులు పడిన ఎనామిల్ గిన్నె వుంది. దానిలో చిల్లర డబ్బులున్నాయి. అంతే! వాడికి అర్థమయి పోయింది తనెలా బ్రతుకుతున్నాడో. అంటే తను అడుక్కు తింటున్నాడన్నమాట! అలా అడుక్కుతినడం వాడికి అవమానంగా తోచింది. అంతేకాదు తన జీవితం మీద రోతకూడా పుట్టింది. కాని ఏమి చెయ్యగలడు తను? కష్టించి పనిచెయ్యలేని పసితనం. అందుకే విధి లేక కొంతకాలంవరకూ పాతజీవితంలోనే బ్రతి

కాదు. ఆ తర్వాత—సోమరిపోతులా ఒకరి దయాదాక్షిణ్యాల మీద బ్రతగ్గూడదని నిశ్చయించుకున్నాడు. అంతే! ఆ ఆలోచన రావడమే తడవుగా అడుక్కు తినడానికి స్వస్తి చెప్పాడు. వాడి చిన్న బుర్రలో ఎన్నో ఆలోచనలు బొంగరంలా గిరగిరా తిరిగాయి—ఎలా బ్రతకాలి? ఎలా బ్రతకాలి? అని. ఆఖరుకి ఓ ఆలోచన వచ్చింది. అదే వాడికి నచ్చింది. అది తప్పో వొప్పో ఆలోచించుకొనే పరిపక్వ దశలో వాడి మెదడుగానీ, ఆలోచనా విధానంగానీ వాడికి లేకపోయింది. అందుకే పూలమ్ముకొనే వాడిగా రంగంలో ప్రవేశించాడు. అలా వచ్చిన డబ్బులతో ఎలాగో వాడి పొట్టను వాడు పోషించుకుంటున్నాడు.—ఇదీ రంగడ్ని గురించి సుజాత చెప్పిన కథా సారాంశం.

నాకెందుకో వాడి కథ విన్న తర్వాత రంగడి మీద చెప్పలేనంత అభిమానం ఏర్పడిపోయింది.

విచక్షణా జ్ఞానంలేని ఏ పుణ్యాత్మురాలో చేసిన చీకటి తప్పుకు ప్రతిఫలంగా వాడు భూమ్మీదపడి కళ్ళు తెరిచాడు. పుట్టినందుకు విధినీ, జన్మనిచ్చి, నిర్దాక్షిణ్యంగా గాలికి వొదిలేసిన కసాయి తల్లిదండ్రుల్నీ తిట్టుకుంటూ, సోమరిపోతులా వాడు బ్రతకాలనుకోలేదు. కష్టించి పొట్టనింపుకోవాలనే విచక్షణా జ్ఞానం వాడిలో కలిగినందుకు నిజంగా రంగడ్ని మనసులోనే అభినందించాను.

అది మొదలుకొని రంగడు రోజూ మా ఇంటికి వస్తూనే వున్నాడు. రోజూ సుజాతకు పూలు యిస్తూనే వున్నాడు.

కొద్ది రోజుల్లోనే సుజాతకీ రంగడికీ ఓ విధమైన బంధం ఏర్పడిపోయింది. వాడిని పిలిచి అప్పుడప్పుడూ ఏ కాఫీనో, టీనో యిస్తుండేది. కొన్ని కొన్ని సమయాల్లో అన్నంకూడా పెడుతూండేది. వీలుపడినప్పుడల్లా నాతోనూ సుజాతతోనూ గంటల తరబడి లోకాభిరామాయణం మాట్లాడుతూ మా ఇంట్లోనే కాలం గడిపేవాడు రంగడు.

నాకు రంగడిమీద ఏర్పడిన సదభిప్రాయానికి చిహ్నంగా ఒకటీ రెండు సందర్భాలలో నేను వాడికి కొత్తబట్టలు కూడా తీసిచ్చాను. అంతేకాదు. వీలుచూచుకొని ఎప్పుడో ఒకసారి రంగడ్ని నేను పనిచేసే కంపెనీలోనే ఏదో ఒక చిన్న పనిలో నియమించాలనికూడా నేనూ సుజాతా ఎన్నోసార్లు అనుకున్నాము.

కాని, నా ఆలోచనలు తారుమారయ్యాయి. నేను రంగడిమీద ఏర్పరచుకున్న సదభిప్రాయం ఒక్కసారిగా నేల పాలయిన పన్నీరయి పోయింది.

ఆ రోజు ఆ క్షణం నేను రంగడ్ని చూచిన క్షణం వాడూ భయం భయంగా నన్ను చూచిన క్షణం వాడి చూపులూ నా చూపులూ ఒకేక్షణం 'ఢీ'కొన్న క్షణం వాడు చేస్తున్న పని నీచాతి నీచమైన పని నాలో పెనుతుఫాను సృష్టించిన క్షణం వొద్దు వొద్దు ఆ ఆలోచనే అతి భయంకరం

ఆ సంఘటన తలుచుకున్నప్పుడల్లా నా ఒళ్ళు జలదరిస్తుంది. నాలో రంగడిమీద వున్న సానుభూతి, జాలి పటాపంచలయిపోతుంది నాలో కోపం కట్టలు తెంచుకొంటుంది.

దీనికి కారణం ఏమిటి? ఎందుకు రంగడిమీద ఇంత అసహ్యాన్నీ ఏహ్యభావాన్నీ ఏర్పరచుకున్నాను? .

* * *

ఆ రోజు—

ఆదివారం. ఆఫీసు లేదు.

శనివారం రాత్రి స్నేహితులతో సెకెండుషో సినిమా చూచి, రాత్రి ఆలస్యంగా ఇంటికి వొచ్చి, ఆలస్యంగా నిద్రపోవడంవల్ల, నిద్రమత్తు వొదలక, బారెడు పొద్దెక్కినా ఇంకా ముసుగుతన్ని పడుకునే వున్నాను.


"ఏవండీ! ఏవండోయ్! మిమ్మల్నే"

ఎవరో నన్ను తట్టి పిలుస్తుంటే, ఉలిక్కిపడి, దుప్పటి ముఖంమీది నుండి క్రిందికి జరిపి, కళ్ళు నులుముకుంటూ చూశాను.

ఎదురుగా సుజాత!

"ఏమిటి సుజీ! ఈ అకాల బలాత్కారం?" అన్నాను ఆవలిస్తూ వొళ్ళు విరుచుకుంటూ.

"పాపం అయ్యగారికి తెల్లవారకపోయినా,




పొద్దెక్కి చాలా సేపయింది. లేవండి. మీకోసం మీ ఆఫీసు ప్యూనట ఎవరో వచ్చాడు." అని "నా పని నేను చేశాను. ఇక మీ ఇష్టం. నాకు అవతల వంటింట్లో తాళింపు మాడిపోతోంది" అంటూ నా సమాధానంకోసంకూడా ఎదురు చూడకుండా గబగబా వంటింట్లోకి వెళ్ళి పోయింది సుజాత.

నేను ఆలోచనలో పడిపోయాను.

ఆదివారంకూడా ఆఫీసు ప్యూను ఎందుకు ఊడిపడ్డాడు? ఏదైనా కొంప మునిగిపోలేదు గదా! అని కొండంత ఆశ్చర్యపోయాను. ఆ ఆ తర్వాత మా ప్యూనుగాడ్ని మనసులోనే కసి తీరా తిట్టుకొని, ఆ నోటితోనే బంగారంలాంటి నిద్ర పాడుచేసినందుకు మా శ్రీమతినీ తిట్టుకొని, విధిలేక, అసలు విషయం తెలుసుకోవాలనే ఉద్దేశంతో, మంచంమీదినుండి క్రిందికి దిగి, భారంగా అడుగులేసుకుంటూ బయటికి నడిచాను.

నేనూహించినట్టుగానే నిజంగానే కొంప మునిగింది.

వెంకన్న చెప్పిన వార్త విని కాసేపు కాళ్ళూ చేతులూ ఆడలేదు.

ప్రొద్దున్నే ఎంత విషాదకరమైన వార్త!

నా స్నేహితుడు శంకరం అకస్మాత్తుగా గుండె ఆగిపోయి ప్రొద్దున్నే చనిపోయాడట!!

శంకరం నాకు చాలా కావలసిన వాడు. చిన్నప్పటినుండి ఒకేచోట చదువుకున్నాం. ఒకే జట్టుగా ఆడుకొన్నాం. కలిసికట్టుగా ఎన్నో అల్లరి చిల్లరి పనులు చేశాం. కలిసి ఇదే ఊళ్ళో ఇదే వీధుల్లో చెప్పులు అరిగిపోయేలా, కాళ్ళు నొప్పులు పుట్టేలా తిరిగాం. చిన్నప్పుడు అమ్మా నాన్నలకు తెలీకుండా ఇంట్లోంచి డబ్బులు దొంగిలించి, స్కూలుకు ఎగనామం పెట్టేసి, దొంగ చాటుగా సినిమాలకి చెక్కేసే వాళ్ళం. ఆఖరుకు ఒకే ఊళ్ళో ఒకే ఆఫీసులో ఓ మాదిరి ఉద్యోగాల్లో స్థిరపడిపోయాం.

అటువంటిది మా ఇద్దరి పరిచయం.

శంకరం, నేనూ కలిసి నిన్న ఆఫీసు వొదిలిన తరువాత నాయర్ హోటల్లో మిరప కాయ బజ్జీలు కూడా తిన్నాం. నవ్వుతూ, కబుర్లు చెప్పుకుంటూ రాత్రి స్నేహితులతో సెకండు షో సినిమా కూడా చూశాం.

కాని ఎంతలో ఎంత ఘోరం జరిగిపోయింది!

నిన్న ఉన్న శంకరం ఈరోజూ లేడనే నిజాన్ని తలుచుకుంటుంటేనే నా గుండె చెరువై పోతోంది.

గబగబా ఈ వార్తని సుజాత చెవిలోపడేసి, ఆలస్యం చెయ్యకుండా బట్టలు వేసుకొని వీధిలో పడ్డాను.

నేను వెళ్ళేసరికి శంకరానికి నీళ్ళుపోసి, పాడెమీద పడుకోబెట్టారు. ఆఖరిసారిగా వాడి ముఖాన్ని చూసే అదృష్టంకూడా నాకు కలగ లేదు. ముఖమూ, ఒళ్ళూ కనిపించకుండా నిండుగా తాజా పూలతో కప్పేసి వుంది.

వాడిని కడసారిగా చూసుకోడానికి కూడా నోచుకోని నా దురదృష్టానికి లోపల్లోపలే కుమిలి పోతూ, శవాన్ని అనుసరించి స్మశానానికి బయలుదేరాను. అక్కడ స్మశానం తతంగం పూర్తి అయేసరికి పన్నెండు గంటలు దాటి పోయింది. ఆఖరి నిట్టూర్పులు వొదిలి అందరూ తిరుగు ముఖం పట్టారు.

నెత్తిమీద సూర్యుడు నిప్పులు చెరగు తున్నాడు.

స్మశానం నుండి వొచ్చేస్తూ, స్మశానం ఎంట్రెన్స్‌కి లోపల, దారికి ఒక ప్రక్కన వున్న బావి దగ్గర, అందరితోపాటు నేనూ కాళ్ళూ చేతులూ కడుక్కుంటూ, కడసారిగా శంకరాన్ని సమాధిచేసిన స్థలం వైపు దృష్టిని మళ్ళించాను.

ఆశ్చర్యం!

నా శరీరం మంచులా గడ్డ కట్టి పోతోంది.

అక్కడ.

పదీ, పది సంవత్సరాలలోపు వయస్సున్న ముగ్గురు పిల్లలు ఎంగిలి విస్తరాకు దగ్గర కాట్లాడుకునే కుక్కల్లా కొట్లాడుకుంటున్నారు.

నాలో ఏదో అనుమానం!

నా అనుమానాన్ని నివృత్తి చేసుకోడానికి, కళ్ళు నులుముకొని మరోసారి పరీక్షగా చూశాను. సందేహంలేదు. ఆ ముగ్గురు పిల్లల్లో రంగడూ వున్నాడు.

ఇక్కడ వాడెందుకు వున్నట్లు? ఇక్కడ వాడికేమిటిపని? ఎందుకు మిగతా ఇద్దరు పిల్ల లతో కొట్లాడుతున్నాడు?

ఎన్నో ప్రశ్నలు. ఎన్నో అనుమానాలు.

చాలాసేపు అర్థం కాలేదు.

ఆలోచనలు కుమ్మరిపురుగుల్లా బుర్రని తొలిచేస్తున్నాయి.

ఆలోచిస్తూ అలాగే నిలబడిపోయాను.

ఒకటీ రెండూ మూడూ....నిముషాలు భారంగా, బాధాకరంగా దొర్లిపోతున్నాయి.

నేను చూస్తున్నంతలోనే రంగడు ఎంట్రెన్స్ వైపు వేగంగా పరుగెత్తుకుంటూ వస్తున్నాడు. ఏదో విజయం సాధించిన గర్వం, తృప్తి వాడి కళ్ళల్లో

నేను కావాలనే రోడ్డుకు అడ్డంగా నిల బడ్డాను.

పరుగెత్తు కొస్తున్న రంగడు ఠక్కున ఆగిపోయాడు.

అప్పటి క్షణంవరకూ వాడి కళ్ళలో వున్న ఆనందం, తృప్తి విజయగర్వం మరు క్షణంలో మాయమై పోయాయి. నన్ను యింతకు ముందే చూచి వున్నట్లయితే అసలు రంగడు యింత త్వరగా యిటువేపు వచ్చివుండే వాడు కాదేమో!

అది వాడి గ్రహపాటా? లేక నేను వాడి దృష్టిలో పడటం నేను చేసిన పొరపాటా? ఏమో? ఏది ఏమైనా నేను వాడ్ని చూడ్డం తట స్థించింది. వాడూ నన్ను చూశాడు. అంతే!

నా చూపులూ, వాడి చూపులూ క్షణకాలం కలుసుకొన్నాయి. ఆ తరువాత విడిపోయాయి.

వాడిలో—దొంగతనం చేస్తూ పట్టుబడి పోయిన వాడి నిస్సహాయత, వాడి వ్యాపార రహస్యం నాకు తెలిసిపోయిందనే భయం, వాడిమీద నాకు ఏర్పడిన అభిమానం, సదభి ప్రాయం, ఈ క్షణం నుంచి మంట కలిసి పోతుందనే బాధ, బ్రతుకు తెరువు బండపాల యిందనే వ్యథ, దుఃఖం, నిస్పృహ.

నాలో—వాడిమీద, వాడు బ్రతుకుతున్న నీచమైన బ్రతుకుమీదా చెప్పలేనంత రోత; ఇంతకాలం నమ్మించి గొంతుకోశాడనే కోపం; ఛీ! ఛీ! నీదీ ఒక బ్రతుకేనా? నువ్వూ వొక మనిషివేనా? — అనే ఏహ్యాభావం. అసహ్యం, ఛీదరింపు.

నా వొంటిమీద తేళ్ళూ, జెర్రులూ ప్రాకి

నట్టు వొళ్ళంతా కంపరమెత్తి పోతోంది.

ఆ క్షణంలోనే గత స్మృతులు జ్ఞప్తి కొస్తున్నాయ్.

ఇంతకాలం సుజాత కురుల నలంకరించిన పూల అందాలూ——

పడగ్గదిలో నేనింతకాలం ఆస్వాదించిన పూల పరిమళాలూ——

రంగడు సమాధుల మీద దొంగిలించిన పూలవా?!

ఛీ! ఛీ! నాలో కోపం కట్టలు తెంచుకొంది.

నా కళ్ళనుండి నిప్పులు రాలుతున్నాయి.

"రంగా!"——నా గొంతు నాకే ఆశ్చర్యంగా, కోపంగా వుంది.

రంగడు పెనుతుపాను తాకిడికి తట్టుకో లేక కదిలిపోయే చెట్టులా గజగజ వొణికి పోతున్నాడు.

అంతసేపూ భద్రంగా రంగడి దోసిట్లోవున్న పూల గుత్తులు గుబుక్కున నేలమీద పడి పోయాయి.

నా తీక్షణ వీక్షణాల బారినుండి తప్పించు కోవాలి అన్నట్లుగా రంగడు గుబుక్కున నేలకి ఒరిగాడు.

కాళ్ళకు పని కొద్దీ పరుగులంకించుకున్నాడు.

అంతే!

ఆరోజు మొదలుకొని ఇంతవరకూ రంగడు మరి నాకు కనిపించలేదు. కాని రంగడు నా కెప్పుడూ జ్ఞాపక మొస్తూనే వుంటాడు. జ్ఞాపకం వొచ్చినప్పుడల్లా, వాడి బ్రతుకు బాటలో చిచ్చు రగిల్చిన వాడిని నేనేననీ, వాడి చిన్నారి మన సును ఎంతగా బాధించి వుంటానో గదాని, నా మనసు చివుక్కుమంటూనే వుంది.

ఇప్పుడు ఆలోచిస్తుంటే, ఈ దేశంలో ఎంతో మంది ఎన్నో మోసాలుచేస్తూ పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్నప్పుడు, అప్రాల్ ఒక దిక్కులేనివాడు, తెలిసీ తెలి యని వయసులో వున్నవాడు, ఏదో బ్రతుకు తెరువుకోసం సమాధులమీది పూలను దొంగి లించి, అమ్ముకోడం అదేమంత మోసం కాదేమో ననిపిస్తుంది నాకు. అందుకే వాడు ఎప్పుడైనా నాకు తటస్థపడితే వాడిని మంచిగా అనునయించి, సక్రమంగా బ్రతకటానికి ఏదో ఒక మార్గం చూపెట్టాలని కూడా అనుకొంటూ వుంటాను.


కాని నా మనసు నాకు చెప్తూ వుంటుంది. రంగడు యిక నీకు కనిపించడు. ఇక ఎవరికీ కనిపించడు - అని.

అయినా - ఇప్పటికీ సుజాత వాడికోసం ఆశగా నిరీక్షిస్తూనేవుంది, అసలు నిజం తెలియక.

కాని - నాకు నిజం తెలిసినా సుజాతకు చెప్పలేను. చెప్పి సుజాతకు రంగడిమీదవున్న సానుభూతినీ, సదభిప్రాయాన్నీ వమ్ము చెయ్య లేను. ఈ నిజాన్ని నాలోనే గరళంలా దాచు కొంటాను.

అంతే! అంతే!! □

## (వి)చిత్ర విజ్ఞానం




ఎక్కువసేపు నమిలి తినగల పదార్థాలను మనం ఆహారంగా వాడితే ఒళ్ళు అనవసరంగా లావెక్కదు అంటున్నారు బ్రిస్టల్ (ఇంగ్లాండు) లోని డా॥ హీటన్! పీచు, నార కలిగిన కూర గాయలను వాడితే, వాటిని ఎక్కువసేపు నమ లాల్సిన స్థితి ఏర్పడ్డంవల్ల, ఉదరంలో కొన్ని రసాలు స్రవింపబడి, అవి కడుపునిండిన తృప్తిని కలుగజేస్తాయి. అందువల్ల ఎక్కువ ఆహారం తినబుద్ధికాదు. ఈ మితభోజనం ఒళ్లు లావెక్కకుండా కాపాడుతుంది. "స్లిమ్"గా వుండాలనుకున్న వాళ్ళు తీపి పదార్థాలకు దూరంగా వుండాలి.